సాక్షి విశాఖపట్నం

ఆదివారం । 18 । ఫిబ్రవరి । 2024



నిబద్ధతతో పనిచేయాలి

ఓటర్ల నమోదు ప్రక్రియలో నిబద్ధతతో పని చేయాలని జేసీ మయూర్ అశోక్ బూత్ లెవెల్ ఆఫీసర్స్‌ను ఆదేశించారు. 8లో



నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు

మిలాన్- 2024లో సందర్భంగా నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్టు శాంతి భద్రతల డీసీపీ-1 మణికంఠ తెలిపారు. 8లో



మహిళా హక్కులను రక్షించాలి

మహిళల హక్కులను పరిరక్షించాలని విశాఖ మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి శిరిపురపు శ్రీదేవి సూచించారు. 8లో

అదుర్స్

- మిలాన్ రిహార్సల్స్ ప్రారంభం
- నేడు, రేపు కూడా..



స్పీడ్ జెట్ యుద్ధ విమానాలు



తీవ్రవాదులను హతమార్చిన కమాండోలు





పారాచూట్‌తో డైవ్ చేసిన కమాండో



దేశంలోని వివిధ రక్షణ బలగాల కవాతు

బీచ్‌రోడ్డు : తూర్పు నౌకాదళం ఆధ్వర్యంలో ఈ నెల 19 నుంచి 27వ తేదీ వరకు మిలాన్-2024 విన్యాసాలు జరగనున్నాయి. ఇందులో భాగంగా విశాఖ సాగర తీరంలో నేవీ అధికారులు శనివారం నిర్వహించిన రిహార్సల్స్ అందరినీ ఎంతగానో ఆకట్టుకున్నాయి. భారీ యుద్ధనౌకలు, స్పీడ్ బోట్లు, ఫైటర్ జెట్స్, యుద్ధ విమానాల సందడి.. ప్యారాచూట్లతో నేవీ సిబ్బంది చేసిన విన్యాసాలు నగర వాసులను ఆకర్షితులను చేశాయి. హెలికాప్టర్



కమాండోలు

ద్వారా ప్రమాదంలో చిక్కుకున్న వారిని రక్షించటం, తీవ్రవాదుల దాడులను ఎదుర్కొవటం ప్రదర్శించారు. అనంతరం యుద్ధ నౌకలు ఒకదానిపై మరొకటి బాంబుల వర్షం కురిపించుకున్నాయి. హాక్స్, ఫైటర్ జెట్స్ తీరంలో బాంబులను వెదజల్లుతూ అలరించాయి.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు

వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు అదుర్స్ అనిపించాయి. జాతీయ గీతాలకు తమదైన శైలిలో నృత్య ప్రదర్శన చేసి చిన్నారులు అలరించారు. జాతీయ ఐక్యత, దేశ రక్షణ గురించి వివరిస్తూ సాగిన నృత్యాలు అబ్బుర పరిచాయి.

భారీ కవాతు

వివిధ భద్రతా బలగాల ప్రదర్శనలు మైమరిపించాయి. నేవీ, ఎయిర్ ఫోర్స్, ఆర్మీ, సీఐఎస్ఎఫ్, బీఎస్ఎఫ్, రాష్ట్ర పోలీసులు, వివిధ బెటాలియన్స్, ఎన్‌సీసీ విద్యార్థుల కవాతు ప్రదర్శన కిలోమీటర్ మేర సాగింది. ఈ కవాతులో మిలాన్‌లో పాల్గొనే ఇతర దేశాలు కూడా ఉండనున్నాయి.

22న తుది విన్యాసాలు

ఈ నెల 22వ తేదీన మిలాన్ 2024 హార్బర్ ఫేజ్ తుది విన్యాసాలు జరగనున్నాయి. ఇందుకు సంబంధించిన రిహార్సల్స్‌ను ఆది, సోమవారాల్లో నిర్వహించనున్నారు. అలాగే 20వ తేదీన ఫైనల్ రిహార్సల్స్‌ను చేయనున్నారు. ఈ రిహార్సల్స్‌కు నేవీ సిబ్బంది, కుటుంబ సభ్యులు, పలువురు ప్రముఖులు పాల్గొనున్నారు.

ముఖ్య అతిథిగా ఉప రాష్ట్రపతి, సీఎం

ఈనెల 22న హార్బర్ ఫేజ్ తుది విన్యాసాలను తిలకించేందుకు ముఖ్యఅతిథులుగా ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్కర్, ముఖ్యమమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాల్గొననున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను నేవీ, జిల్లా అధికార యంత్రాంగం చేస్తోంది.

పకడ్బందీగా మిలాన్ ఏర్పాట్లు

మహారాణిపేట : నేవల్ కమాండ్ ఆధ్వర్యంలో ఈనెల 19 నుంచి 27వ తేదీ వరకు రెండు ఫేజ్‌లుగా జరగనున్న మిలాన్-2024 వేడుకల విజయవంతానికి పటిష్ట చర్యలు చేపట్టాలని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ఆదేశించారు. జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ, ఏడీసీ విశ్వనాథన్, ఇతర అధికారులతో కలిసి బీచ్ రోడ్‌లో జరుగుతున్న పనులను శనివారం పరిశీలించారు. ఈ నెల 19 నుంచి 23వ తేదీ వరకు హార్బర్ ఫేజ్, 24 నుంచి 27వ తేదీ వరకు సీ ఫేజ్ మిలాన్-2024 కార్యక్రమాలు జరగనున్న నేపథ్యంలో నేవీ వైపు నుంచి ఇప్పటి వరకు చేపట్టిన చర్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. వేడుకలను వీక్షించేందుకు లక్షలాది మంది ప్రజలు వచ్చే అవకాశం ఉన్నందున ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా అధికారులకు సూచించారు. బీచ్ రోడ్డులో మొత్తం 30 ఎస్ క్లోజర్లు, 30 ఎల్‌ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేశామని నేవీ అధికారులు కలెక్టర్‌కు వివరించారు. సామాన్య ప్రజలు వీక్షించేందుకు అనువుగా బీచ్ వైపు కూడా ఎల్‌ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేయాల్సి ఉందని పేర్కొన్నారు. వీవీఐపీ, వీఐపీ రక్షణ ఏర్పాట్లు, బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించాలని పోలీసు అధికారులకు చెప్పారు. ప్రజలు వీక్షించేందుకు అనువుగా బీచ్ ఏరియాలో బారికేడ్లు, తాగునీటి వసతి, బయో టాయిలెట్లను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. బీచ్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, ఏపీఐఐసీ, ఏయూ గ్రౌండ్‌లో పార్కింగ్ ఏర్పాట్లు చేయాలని సూచించారు. పలువురు నేవీ కమాండర్లు, లెఫ్టినెంట్ కమాండర్లు, పోలీసు అధికారులు, వీఎంఆర్డీఏ, జీవీఎంసీ, ఆర్ అండ్ బీ, సమాచార పౌర సంబంధాల శాఖ జేడీలతో పాటు వివిధ విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్ మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

20న స్థాయీ సంఘ సమావేశం

డాబాగార్డెన్స్: జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశం ఈ నెల 20న నిర్వహించనున్నారు. నగర మేయర్, స్థాయీ సంఘ చైర్‌పర్సన్ హరి వెంకటకుమారి అధ్యక్షతన ఆ రోజు ఉదయం 11 గంటలకు నిర్వహించనున్న సమావేశానికి 136 అంశాలు సభ్యుల ఆమోదానికి రానున్నాయి. వీటిలో ప్రధానంగా పలు వార్డు ల అభివృద్ధి పనులు, జీవీఎంసీ 8 జోన్ల పరిధిలో గల జీవీఎంసీ దుకాణాలు, కల్యాణ మండపాలు, పార్కింగ్ ఫీజులు బహిరంగ వేలం ద్వారా ఇచ్చేందు కు సభ్యులు చర్చించి ఆమోదం తెలపనున్నారు. జోన్-3 పరిధి 22వ వార్డు శివాజీపాలెం రాజీవ్‌నగర్‌లో జీ+1 కమ్యూనిటీ హాల్, సచివాలయం నిర్మాణం, 21వ వార్డులో హెరిటేజ్ మ్యూజియంలో దెబ్బతిన్న అల్మారాల అలంకరణ, తగిన పరికరాల ఏర్పాటు, పలు అభివృద్ధి పనులకు సంబంధించి చర్చించనున్నారు. ఇటీవల పలు నియోజకవర్గాల్లో నిర్వహించిన వైఎస్సార్ ఆసరా కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లు, 69, 70 వార్డుల్లో షీలానగర్ నుంచి పాత గాజువాక జంక్షన్ వరకు పడమర వైపు సెంట్రల్ మీడియన్, ఎంఎస్ గ్రిల్‌కు మరమ్మతులు, జాతీయ రహదారి ఇరువైపుల అభివృద్ధి పనులు తదితర అంశాలపై సభ్యులు చర్చించి ఆమోదించనున్నారు.

వచ్చే ఎన్నికల్లో ప్రభంజనమే..

- వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్
- పార్టీ 60 అడుగుల జెండా ఆవిష్కరణ

సీతంపేట: వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీ ప్రభంజనం సృష్టించి, మళ్లీ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అవుతారన్న విశ్వాసంతో ప్రజలంతా ఉన్నారని వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ తెలిపారు. జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అక్కయ్యపాలెం హైవే కూడలి వద్ద వైఎస్సార్ సీపీ 60 అడుగుల భారీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం శనివారం జరిగింది. మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, రాష్ట్ర నెడ్ క్యాప్ చైర్మన్ కె.కె.రాజు, నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్‌లతో కలిసి వై.వి.సుబ్బారెడ్డి పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు రాజధానులు ప్రకటించిన నాటి నుంచి ప్రతిపక్షాలు కోర్టులకు వెళ్లి ఎన్ని అడ్డంకులు సృష్టించారో అందరికీ తెలుసన్నారు. వాటన్నింటిని అధిగమించి త్వరలో ఇక్కడ నుంచి ముఖ్యమంత్రి పాలన కొనసాగించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. రాష్ట్రంలో 175 నియోజకవర్గాలలో పార్టీ గెలుపు కోసం అందరిని ఒప్పించి. అందరికీ ఆమోదయోగ్యంగా జగన్‌మోహన్‌రెడ్డి అభ్యర్థుల మార్పులు చేర్పులు చేస్తున్నారని తెలిపారు. తన వల్ల రాష్ట్రానికి, ప్రజలకు మేలు జరిగిందని నమ్మితేనే ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలని జగన్‌మోహన్‌రెడ్డి అంటున్న విధంగా చంద్రబాబు నాయుడు ధైర్యంగా చెప్పగలరా అని ప్రశ్నించారు. అనంతరం బాణాల యువసేన అధ్యక్షుడు బాణాల తరుణ్ ఆధ్వర్యంలో వై.వి.సుబ్బారెడ్డి, మంత్రి అమర్‌నాథ్, సమన్వయకర్త కె.కె.రాజు, మేయర్ హరివెంకటకుమారి, ఫ్లోర్ లీడర్ బాణాలను గజమాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, రాష్ట్ర, జిల్లా నాయకులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, సభ్యులు, డైరెక్టర్లు, మండల ఇన్‌చార్జిలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.



జెండాను ఆవిష్కరిస్తున్న రీజనల్ కోఆర్డినేటర్ వై.వి. సుబ్బారెడ్డి, మంత్రి అమర్‌నాథ్, కె.కె.రాజు, మేయర్ హరి వెంకట కుమారి, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి



రెపరెపలాడుతున్న భారీ జెండా

వైభవంగా శ్రీనివాస కల్యాణం



కల్యాణంలో పాల్గొన్న భక్తులు



అమ్మవారికి పూజలు చేస్తున్న స్వామీజీలు

పెందుర్తి: జగన్మాత సన్నిధిలో శ్రీనివాసుని కల్యాణం వేడుకగా సాగింది. శారదాంబ ప్రాంగణంలో వేదఘోషతో ప్రతిధ్వనించింది. లోకకల్యాణార్థం తలపెట్టిన రాజశ్యామల, వనదుర్గ హోమాలతో ఆధ్యాత్మికత పరిమళించింది. మూడోరోజు శనివారం యజ్ఞయాగాదులు దిగ్విజయంగా జరిగాయి. పీఠం అనుష్ఠాన దేవత శారదా స్వరూప రాజశ్యామల అమ్మవారు, దక్షిణామూర్తి, వనదుర్గ, దాసాంజనేయ స్వామి, షణ్ముఖ సుబ్రహ్మణ్యస్వామి, చంద్రమౌళీశ్వరస్వామి, కాలభైరవ స్వామి ఆలయాల్లో పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీ, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామీజీ ప్రత్యేక పూజలు చేశారు. గోమాతకు పూజ చేసి నైవేద్యం అందించారు. జమ్మిచెట్టు చుట్టూ ప్రదక్షిణ చేశారు. సాయంత్రం తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీనివాస కల్యాణం వైభవంగా జరిగింది. కల్యాణాన్ని వందలాది మంది భక్తులు తిలకించారు. పీఠం ఆధ్వర్యంలో ప్రసాద వితరణ చేపట్టారు.

స్టీల్‌ప్లాంట్‌లో అగ్ని ప్రమాదం

ఉక్కునగరం: స్టీల్ ప్లాంట్ కోక్ ఓవెన్ విభాగంలోని నాఫ్తలిన్ అంత్రాసిన్ ఫ్రాక్షనల్ క్రిస్టలైజేషన్ (ఎన్ఏఎఫ్‌సీ) ప్లాంట్‌లో శనివారం అగ్నిప్రమాదం జరిగింది. ఉదయం ఉద్యోగులు విధులకు హాజరైన సమయంలో పెద్ద ఎత్తున పొగలు వచ్చాయి. ఆ తర్వాత అవి మంటలుగా వ్యాపించడంతో సీఐఎస్ఎఫ్ ఫైర్ విభాగానికి సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. ప్రమాదం వల్ల విద్యుత్ కేబుళ్లు, మోటార్లకు నష్టం వాటిల్లింది. అదృష్టవశాత్తు ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు. వెల్డింగ్ పనుల వల్ల ప్రమాదం జరిగినట్టు ఆ విభాగం ఉద్యోగుల సమాచారం. విషయం తెలుసుకున్న డీసీపీ-2 శ్రీనివాసరావు, సౌత్ ఏసీపీ టి.త్రినాథ్ ప్రమాదస్థలిని పరిశీలించి అక్కడి అధికారులతో మాట్లాడారు.



ప్రమాదం వల్ల విభాగంలో ఏర్పడిన దట్టమైన పొగలు

కారు బీభత్సం



మృతురాలు జగదీశ్వరి



జగదీశ్వరి (ఫైల్)



దూసుకొచ్చి బోల్తాపడిన కారు

- టిఫిన్ షాపులోకి దూసుకెళ్లిన కారు
- మహిళ మృతి, మరో ఇద్దరికి గాయాలు

సీతమ్మధార: శనివారం ఉదయం 11.25 గంటలు..నక్కవానిపాలెం 60 అడుగుల రోడ్డు సమీపంలో ఎవరి పనుల్లో వారున్నారు. హఠాత్తుగా కారు ఓ ఇంట్లోకి దూసుకొచ్చింది. ఈ సంఘటన మహిళ అక్కడికక్కడే మృతి చెందగా మరో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ హఠాత్పరిణామానికి అక్కడున్నవాళ్లంతా బెంబేలెత్తిపోయారు. వివరాలు ఉన్నాయి. జీవీఎంసీరిధి 24 వార్డు నక్కవానిపాలెం 60 అడుగుల రోడ్డులో శనివారం కారు బీభత్సం సృష్టించింది. అదే ప్రాంతంలోని సీత అపార్టుమెంట్‌లోని శనివారం రాత్రి పెళ్లి. ఈమేరకు బంధువులు పెళ్లి సామగ్రి కొనుగోలుకు కారులో బయలుదేరారు. పెదవాల్తేరుకు చెందిన అలజంగి గణేష్‌ను కారుకు ఆక్టింగ్ డ్రైవర్‌గా పెట్టుకున్నారు. అపార్ట్‌మెంట్ నుంచి కారు అతివేగంగా రాంగ్ రూట్లో వస్తూ తోపుడుబండిని ఈడ్చుకుంటూ మూడు ద్విచక్రవాహనాలను ఢీకొట్టి సమీపంలోని ఓ టిఫిన్ షాపులోకి దూసుకుపోయింది. సంఘటనలో షాపులో ఉన్న జగదీశ్వరి (40) అక్కడికక్కడే మృతి చెందింది. మరో వ్యక్తి లక్ష్మణరావుకు కాలు విరగ్గా ఓ చిన్నారికి స్వల్ప గాయాలయ్యాయి. దీంతో బంధువులు కన్నీరుమున్నీరయ్యారు. వెంటనే కారులో ఉన్న పెళ్లి వారు ఏఎంజీ ఆస్పత్రికి క్షతగాత్రులను తరలించారు.

సమాచారం అందుకున్న ట్రాఫిక్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరు పరిశీలించారు. వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు. అక్కడ ఉన్న సీసీ ఫుటేజ్‌లను పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ట్రాఫిక్ ఎస్ఐ కనకరాజు, ఏఎస్ఐ ప్రసాద్, సిబ్బంది ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

నిరుపేద కుటుంబంలో విషాదం

జీవనం కోసం టిఫిన్ షాపులో జగదీశ్వరి రోజువారి కూలీగా పని చేస్తోంది. ఆమె కుమారుడు గణేష్ ఇంటర్ చదువుతున్నాడు. నక్కవానిపాలెం రామాలయం వీధిలో వీరిద్దరూ నివాసం ఉంటున్నారు. జగదీశ్వరికి భర్త లేడు. తల్లి కూడా మృతి చెందడంతో గణేష్ ఒంటరి వాడయ్యాడు. శనివారం టిఫిన్ షాపులో ఉల్లిపాయలు కోస్తుండగా కారు ఇంటిపైకి దూసుకురావడంతో జగదీశ్వరి మృతి చెందింది.

త్వరితగతిన కేసుల పరిష్కారానికి చర్యలు

విశాఖ సిటీ: సాంకేతికతను అందిపుచ్చుకొని త్వరితగతిన కేసుల పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాలని పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ సూచించారు. సీపీ ఆధ్వర్యంలో పోలీస్ సమావేశ మందిరంలో శనివారం జ్యుడిషియల్, పోలీస్ అధికారులకు ఇంటరాక్టివ్ సెషన్ నిర్వహించారు. ఇందులో కన్విక్షన్ రేటును మెరుగుపర్చడం, కేసుల దర్యాప్తులో లోపాలు ఉంటే వాటిని గుర్తించి సరిదిద్దడం, పోలీసులకు న్యాయ పరిజ్ఞానాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ఈ సమావేశాన్ని చేపట్టారు.

సమావేశంలో జాయింట్ సీపీ కె.ఫకీరప్ప, డీసీపీ-1 మణికంఠ, డీసీపీ-2 ఎం.సత్తిబాబు, డీసీపీ(క్రైమ్) పి.వెంకటరత్నం, జ్యుడిషియల్ అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పార్టీ విజయమే లక్ష్యంగా..

- 34 నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జులు, పరిశీలకులతో సమావేశం
- హాజరైన వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, డిప్యూటీ రీజినల్ కోఆర్డినేటర్లు


సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి

సాక్షి, విశాఖపట్నం: ఉత్తరాంధ్రలో గత ఎన్నికల్లో కన్నా ఎక్కువ స్థానాల్లో వైఎస్సార్ సీపీ విజయం సాధించేలా కృషి చేయాలని ఆ పార్టీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం ఎండాడ లాకాలేజీ సమీపంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఉత్తరాంధ్రలోని పార్టీ ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలు, నియోజకవర్గ పరిశీలకులతో ఆయన సమావేశమయ్యారు. ముందుగా పార్టీ కార్యాలయంలో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఏ క్షణంలోనైనా ఎన్నికల నగరా మోగనుందని, రానున్న 60 రోజులు చాలా కీలకమన్నారు. రాష్ట్ర ప్రజలు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసేందుకు సిద్ధంగా ఉన్నారని, ఇందులో ఉత్తరాంధ్ర ప్రజలు ముఖ్య పాత్ర పోషించనున్నారని చెప్పారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు ఎన్నికల సమయంలో బూత్ స్థాయిలో చేపట్టాల్సిన కార్యాచరణకు సంబంధించి మార్గదర్శకం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం రాజన్నదొర, మంత్రులు సీదిరి అప్పలరాజు, డిప్యూటీ రీజనల్ కో ఆర్డినేటర్లు గుడివాడ అమర్‌నాథ్, మజ్జి శ్రీనివాసరావు, పార్టీ జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్, బొడ్డేడ ప్రసాద్, పరిక్షిత్‌రాజు, ఎంపీలు ఎంవీవీ సత్యనారాయణ, బెల్లాన చంద్రశేఖర్, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, వాసుపల్లి గణేష్‌కుమార్, తిప్పల నాగిరెడ్డి, గొల్ల బాబూరావు, పెట్ల ఉమాశంకర్ గణేష్, కంబాల జోగులు, అన్నంరెడ్డి అదీప్‌రాజ్, గొర్లె కిరణ్‌కుమార్, రెడ్డి శాంతి, బొత్స అప్పలనర్సయ్య, బడుకొండ అప్పలనాయుడు, శంబంగి చినఅప్పలనాయుడు, కడుబండి శ్రీనివాసరావు, పుష్ప శ్రీవాణి, అలజంగి జోగారావు, కళావతి, ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, సురేష్‌బాబు, దువ్వాడ శ్రీనివాసరావు, పాలవలస విక్రాంత్, శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గ ఇన్ చార్జి పేరాడ తిలక్, సమన్వయకర్తలు కె.కె రాజు, అడారి ఆనంద్, మత్స్యరాస విశ్వేశ్వరరాజు, రేగం మత్స్యలింగం, తలా రాజేష్, ఉరుకూటి చందు, మల సాల భరత్‌కుమార్, నియోజకవర్గ పరిశీలకులు హాజరయ్యారు.


హాజరైన ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జులు, పరిశీలకులు

థ్రిల్లింగ్‌గా నీటిపై తేలియాడే వంతెన

- పర్యవేక్షించిన కలెక్టర్ మల్లికార్జున
- సాంకేతిక ప్రక్రియ పూర్తయిన వెంటనే ప్రారంభం


వంతెనపై నడుస్తున్న కలెక్టర్ మల్లికార్జున

బీచ్‌రోడ్డు : నీటిపై తేలియాడే వంతెన చాలా థ్రిల్లింగ్‌గా ఉందని కలెక్టర్ మల్లికార్జున అన్నారు. శనివారం ఆయన బీచ్‌రోడ్డులోని వంతెనను సందర్శించారు. ఈ సందర్భంగా మల్లికార్జున మాట్లాడుతూ బీచ్ నుంచి సమారు 100 మీటర్ల మేర సముద్రంలోకి వేసిన వంతెనపై కలెక్టర్ నడిచి వెళ్లారు. ఈ వంతెనకు భద్రతాపరమైన చర్యలు పటిష్టంగా చేపట్టాలన్నారు. అలల తాకిడికి పర్యాటకులు ఇబ్బంది పడకుండా వంతెనకు అటు ఇటూ గట్టిగా బలమైన రోప్‌లు ఏర్పాటు చేయాలన్నారు. నిత్యం గజఈతగాళ్లు ఉండేలా చూడాలన్నారు. లైఫ్ బోట్లను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. నిబంధనల మేరకు కార్యకలాపాలు చేపట్టాలని నిర్వాహకులకు సూచించారు. అన్ని రకాల సాంకేతిక ప్రక్రియలు పూర్తయిన వెంటనే ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో తొలి ప్రాజెక్ట్

నీటిపై తేలియాడే వంతెన రాష్ట్రంలో ఇదే మొదటిదని నిర్వాహకుడు సుదర్శన్ తెలిపారు. ఈ ప్రాజెక్ట్ ఏర్పాటుకు రూ.కోటి వరకు ఖర్చు అవుతుందన్నారు. వీఎంఆర్డీఏ అధికారులతో కలిసి కేరళలో నిర్వహిస్తున్న ఇటువంటి వంతెనలను పరిశీలించామన్నారు. అదేమాదిరిగా మెటీరియల్ సాంకేతిక సహాయాన్ని వినియోగించి ఇక్కడ వంతెన ఏర్పాటు చేస్తున్నామన్నారు. పర్యాటకుల రక్షణ కోసం పటిష్ట చర్యలు చేపడుతున్నామన్నారు. వంతెన బీచ్ నుంచి 100 అడుగుల మేర సముద్రంలోకి ఉంటుందని, చివరి భాగంలో సముద్రం లోతు 6 నుంచి 8 అడుగులు ఉంటుందన్నారు. ఈ మేరకు అన్ని రకాల భద్రతాపరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. వంతెన నీటిపై తేలియాడి ఉండేందుకు అనువుగా ఇప్పటికే సిమెంటుతో తయారు చేసిన యాంకర్లు 34, ఇనుముతో తయారు చేసిన రెండు యాంకర్లను వినియోగించామన్నారు. ఒకేసారి 200 మంది వంతెనపై నడిచి వెళ్లవచ్చన్నారు. ప్రతి 25 మీటర్లకు ఒక గజఈతగాడు ఉండటంతో పాటు పర్యాటకులు వెంట నిరంతరం ముగ్గురు గజ ఈతగాళ్లు ఉంటూ పర్యవేక్షిస్తారన్నారు. వంతెనకు రెండు వైపులా రెండు లైఫ్ బోట్లను నిత్యం అందుబాటులో ఉంచుతామన్నారు.

బీఎల్‌వోలు నిబద్ధతతో పనిచేయాలి

మహారాణిపేట: ఓటర్ల నమోదు ప్రక్రియలో నిజాయితీ, నిబద్ధతతో పని చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ బూత్ లెవెల్ ఆఫీసర్స్, సూపర్ వైజర్లను ఆదేశించారు. శనివారం సిరిపురం వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ ఎరీనాలో శిక్షణ కార్యక్రమంలో జేసీ మాట్లాడారు. ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలు, మార్గదర్శకాలకు అనుగుణంగా బీఎల్‌వోలు, సూపర్ వైజర్లు పనిచేయాలన్నారు. ఓటరు నమోదు ప్రక్రియలో ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా, ఒత్తిడులకు గురికాకుండా పారదర్శకంగా పనిచేయాలని స్పష్టం చేశారు. శిక్షణ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి కె.మోహన్ కుమార్, ఆర్‌డీవో డి.హుస్సెన్ సాహెబ్ పాల్గొన్నారు.

మిలాన్ సందర్భంగా ట్రాఫిక్ ఆంక్షలు


డీసీపీ–1 మణికంఠ చందోలు

అల్లిపురం : ఆర్కేబీచ్ వేదికగా ఈ నెల 22వ తేదీన జరగనున్న మిలాన్–2024లో భాగంగా నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు శాంతి భద్రతల డీసీపీ–1, మణికంఠ చందోలు తెలిపారు. శనివారం సాయంత్రం నగర పోలీస్ కమిషనరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మిలాన్ వేడుకలకు ముఖ్య అతిథిగా భారత ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్, రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పలువురు నేవీ ఉన్నతాధికారులు, వివిధ దేశాల ప్రతినిధులు హాజరవుతున్న నేపథ్యంలో ఈ నెల 20, 22 తేదీల్లో బీచ్‌రోడ్డులో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రాత్రి 8 గంటల వరకు నగర ప్రజలు నేవీ విన్యాసాలు వీక్షించవచ్చన్నారు. ఈ రెండు రోజులు ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉంటాయన్నారు. వాహన చోదకులు ప్రత్యామ్నాయ మార్గాల్లో తమ ప్రయాణం కొనసాగించి పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు.

లోకేష్ శంఖారావం అట్టర్ ఫ్లాప్

- జనం రాకపోవడంతో టీడీపీ డీలా
- గంటకు పైగానే కారవాన్‌లో నారా లోకేష్


జనం రాకపోవడంతో ఖాళీగా కుర్చీలు


లోకేష్ ప్రసంగిస్తుండగా ఖాళీగా కుర్చీలు

తగరపువలస : చిట్టివలస బంతాటమైదానంలో శనివారం సాయంత్రం నిర్వహించిన టీడీపీ శంఖారావం సభకు పిలిచినా ప్రజలెవరూ కదలిరాలేదు. భీమిలి నియోజకవర్గంలోని నాలుగు మండలాలు, చిట్టివలసను ఆనుకుని నెల్లిమర్ల నియోజకవర్గంలో ఉన్న భోగాపురం, డెంకాడ మండలాల నుంచి ఆశించిన జనం రాకపోవడంతో టీడీపీ నాయకులు నివ్వెరపోయారు. 8 వేల కుర్చీల కెపాసిటీ కలిగిన గ్రౌండ్‌లో 6వ వంతు మాత్రమే తీసుకున్నారు. ఇందులో తొలుత 3వేలు కుర్చీలు వేయాలనుకున్నా 1200 మాత్రమే వేశారు. ముందుగా ప్రకటించినట్టుగా సాయంత్రం 4.45 గంటలకు సభ ప్రారంభం కావలసి ఉంది. లోకేష్ కూడా అదే సమయానికి గ్రౌండ్‌కు చేరుకున్నారు. అయితే కుర్చీలన్నీ ఖాళీగా ఉండటంతో వ్యాన్‌లోకి వెళ్లిపోయి 6.25 గంటలకు వరకు బయటకు రాలేదు. జనాలు పెద్దగా లేకపోవడంతో డ్రోన్‌లు ఎగరవేయకూడదని ఆదేశాలు ఇచ్చారు. టీడీపీ, జనసేన జిల్లా అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, వంశీకృష్ణ మాట్లాడతారని ప్రకటించారు. అయితే పల్లాకు ఆ అవకాశం రాలేదు.

మాజీ ఎమ్మెల్యేల ఊసేలేదు..

గతంలో భీమిలి నుంచి ఎమ్మెల్యేలుగా ప్రాతినిధ్యం వహించిన ఆర్ఎస్‌డీపీ అప్పలనరసింహరాజు, గంటా శ్రీనివాసరావు, కర్రి సీతారామ్‌ల ప్రస్తావన కాని, ఫ్లెక్సీల్లో వారి ఫొటోలు కూడా కనిపించలేదు. దీంతో వారి వర్గాలకు చెందిన కార్యకర్తలు శంఖారావం వైపు దృష్టి సారించలేదు. 'ఎవరు ఎన్ని ప్రయత్నాలు చేసినా భీమిలి నియోజకవర్గం జనసేనదే' అంటూ శుక్రవారం సాయంత్రం ఆ పార్టీ నాయకులు సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టి ఎండాడ పార్టీ కార్యాలయంలో బాణసంచా వెలిగించడం ఇక్కడి టీడీపీ నాయకులకు మింగుడు పడలేదు. లోకేష్ ప్రసంగంలో కూడా యథావిధిగా అమ్మకు వందనం పథకం ద్వారా నెలకు రూ.15వేలు, పెట్రోల్, గ్యాస్, డీజిల్ ధరలు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పెంచిందంటూ నవ్వులపాలయ్యారు. దేశ వ్యాప్తంగా ఆటో కార్మికులకు తమ ప్రభుత్వం న్యాయం చేస్తుందన్నారు.

మహిళల హక్కులను పరిరక్షించాలి

విశాఖ–లీగల్ : పని చేసే ప్రదేశాల్లో మహిళల హక్కులను పరిరక్షించాలని, సురక్షితమైన వాతావరణంలో విధులు నిర్వర్తించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులకు విశాఖ మెట్రోపాలిటిన్ సెషన్స్ జడ్జి శిరిపురపు శ్రీదేవి సూచించారు. మహిళల హక్కులకు ఎట్టి పరిస్థితుల్లోనే భంగం కలిగించేలా ఎవరూ వ్యవహరించకూడదన్నారు. పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టం – 2013పై స్థానిక జిల్లా కోర్టు నూతన భవన సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక అవగాహన సదస్సు జరిగింది. జిల్లాలోని వివిధ విభాగాల అధికారులు, వివిధ సంస్థల ప్రతినిధులు, న్యాయవాదులు తదితరులు భాగస్వామ్యమయ్యారు. విశాఖ మెట్రోపాలిటిన్ సెషన్స్ జడ్జి ఎస్. శ్రీదేవి మాట్లాడుతూ చట్టం తాలూక ఉద్దేశాలను, మహిళలకు కల్పించిన రక్షణ చర్యలను వివరించారు. సదస్సులో ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వివేక ఆనంద శ్రీనివాస్, క్రైం డీసీపీ పి. వెంకటరత్నం, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సీహెచ్.రాంబాబు, విశాఖ జిల్లా కోర్టు అదనపు న్యాయమూర్తులు, సీనియర్ సివిల్ జడ్జిలు, పలువురు మేజిస్ట్రేట్లు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధికారులు, వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు, కళాశాలల ప్రిన్సిపాళ్లు, న్యాయవాదులు, కోర్టు అధికారులు పాల్గొన్నారు.

విశాఖ బులియన్

24 క్యారెట్స్(10 గ్రా.)	రూ.62,400
22 క్యారెట్స్(10 గ్రా.)	రూ.57,200
వెండి(కిలో):	రూ.78,000

చికెన్ ధరలు



చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

బ్రాయిలర్ (లైవ్)	: రూ.135
స్కిన్	: రూ.240
స్కిన్‌లెస్	: రూ.250